క్లుప్తంగా

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

చీరాల టౌన్: పంచాయతీల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటుగా పారిశుద్ధ్య నిర్మూలన కోసం ప్రత్యేకంగా కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో శోభారాణి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని గ్రామ పంచాయతీల కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లోని ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండాలంటే గ్రామాలన్నీ సుందరంగా ఉండాలని, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేసి గ్రామాలను రోగాల నుంచి కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ మురళీబాపూజీ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు ఉన్నారు.

దాడిచేసిన వారిని శిక్షించాలని వినతి



సమన్వయకర్త బాలాజీకి సమస్యను వివరిస్తున్న చెంచు కాలనీ వాసులు

పర్చూరు (చినగంజాం): తమ వారిపై కాలనీలోని ఓ వర్గం వారు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని చెంచు కాలనీ వాసులు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త యడం బాలాజీ దృష్టికి తీసుకొని వచ్చారు. శుక్రవారం పర్చూరులోని పార్టీ కార్యాలయంలో సమన్వయకర్తను కలిసి వారు తమ గోడు వినిపించారు. తమకు జరిగిన అన్యాయం గురించి అడగటానికి వెళ్లినందుకు తమపై ఓ వర్గం వారు దాడిచేశారని వివరించారు. దాడిలో గాయపడిన ముగ్గురు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్, అధికారులు

యద్దనపూడి: రానున్న సార్వత్రిక ఎన్నికల కోసం పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేయటంతో పాటు వాటిలో మౌలిక వసతులు కల్పించాలని తహశీల్దారు నాగరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని పోలూరు, శ్యామలవారిపాలెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహశీల్దారు, సెక్టార్ ఆఫీసర్ చిలుకూరి గోపి పరిశీలించారు. ముఖ్యంగా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపుల నిర్మాణంతో పాటు ఫ్యాన్లు, ఫర్నిచర్, తాగునీరు, టాయిలెట్లు, తప్పనిసరిగా ఉండేలా ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వీఆర్వోలు పావని, ఖాలేషావలి, పంచాయతీ కార్యదర్శులు అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న వారికి ఫోన్లు అందజేత



బాధితుడికి ఫోన్ అందజేస్తున్న సీఐ

అద్దంకి రూరల్: ఫోన్లు పోగొట్టుకున్నవారికి సీఐ పీ. కృష్ణయ్య శుక్రవారం ఫోన్లు అందజేశారు. సీఐ వివరాల మేరకు.. చందలూరు గ్రామానికి చెందిన ముప్పనేని వెంకటేశ్వర్లు, గొర్రెపాడు గ్రామానికి చెందిన జీ. ఆదిలక్ష్మిలు 15 రోజుల క్రితం అద్దంకిలో ఫోన్‌లు పొగొట్టుకున్నారు. వెంటనే స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో సీఐ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి వాటిని పట్టుకుని బాధితులకు అందజేశారు. రికవరీలో సహకరించిన కానిస్టేబుల్ ఉయ్యాల బ్రహ్మయ్యను సీఐ అభినందించారు.

గ్రానైట్ అక్రమంగా తరలిస్తే కేసులు

బల్లికురవ: పర్మిట్ లేకుండా అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్ ముడిరాయి లారీని శుక్రవారం మైన్స్ ఆర్ఐ రాజు అదుపులోకి తీసుకున్నారు. బల్లికురవ సమీపంలోని ఈర్లకొండ నుంచి మార్టూరు వైపు వెళ్తుండగా అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. గ్రానైట్ మీటరు రాళ్లు, ముడిరాళ్లు, స్లాబులు పర్మిట్‌తోనే ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీ చెల్లింపుతో ఎగుమతులు చేపట్టాలన్నారు. అక్రమంగా తరలిస్తే కేసులతోపాటు పెనాల్టీ, లారీలను సీజ్ చేస్తామని ఆర్ఐ హెచ్చరించారు.

రెండు చుక్కలతో పోలియో దూరం



మేదరమెట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది



పమిడిపాడులో పల్స్ పోలియో కార్యక్రమంపై ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

బల్లికురవ: పోలియో రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని.. కేవలం రెండు చుక్కలతో పోలియోను దూరం చేయొచ్చని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్ శుక్రవారం కోరారు. జాతీయ పల్స్ పోలియో దినోత్సవం సందర్భంగా ఆదివారం మండలంలో 44 పోలియో బూత్‌లు ఓ మొబైల్ టీమ్ ద్వారా 0–5 సంవత్సరాల్లోపు చిన్నారులందరికి చుక్కలు వేస్తున్నామని చెప్పారు. మండలంలో చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించేలా ర్యాలీలు చేపట్టామన్నారు. 5898 మంది చిన్నారులకు వేయాలని నూరుశాతం లక్ష్యసాధనకు కృషి చెయ్యాలని వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది ఆశ వర్కర్లను కోరారు.

పల్స్ పోలియోను విజయవంతం చేద్దాం..

మేదరమెట్ల: పోలియో రహిత సమాజం కోసం ఈనెల 3వ తేదీన నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ప్రాసంగులపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కే.శశికళ అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని పమిడిపాడు గ్రామంలో శుక్రవారం అవగాహన ర్యాలీలను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ 0–5 సంవత్సరాల పిల్లలందరూ పోలియో చుక్కలు వేయించుకోవాలని దీనికి పిల్లల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. పీహెచ్‌సీ పరిధిలో మొత్తం 2400 చిన్నారులను గుర్తించామన్నారు. నూరుశాతం పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా సిబ్బంది సహకరించాలని డాక్టర్ కోరారు. కార్యక్రమంలో డాక్టర్ అవినాష్ మాట్లాడుతూ మొత్తం 12 బూత్‌లు, 5 సచివాలయాల్లో చుక్కలు వేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సూపర్‌వైజర్ వెంకటరామిరెడ్డి, హెల్త్ విజిటర్ బీ. మహాలక్ష్మి, శ్రీనివాసరావు, ఆశలు పాల్గొన్నారు.

3న పల్స్‌పోలియో కార్యక్రమం..

ఈనెల 3వ తేదీ ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని యద్దనపూడి చినపోలిరెడ్డి ప్రభుత్వ వైద్యాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మేదరమెట్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు జే.చిట్టిబాబు, నిఖిలారెడ్డి గ్రామంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పల్స్ పోలియోపై అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు నివాళి



బ్రహ్మయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న భద్రారెడ్డి

మేదరమెట్ల: రోడ్డు ప్రమాదంలో మరణించిన మేదరమెట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త గుడిపాటి చంద్ర నాగబ్రహ్మాజీ (బ్రహ్మయ్య) మృతదేహానికి ఏఎంసీ మాజీ చైర్మన్ వైవీభద్రారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. శుక్రవారం బ్రహ్మయ్య కుంటుంబ సభ్యులను ఓదార్చారు. వైవీ బ్రహ్మయ్య అంతిమ యాత్రలో పాల్గొన్నారు. నివాళులర్పించిన వారిలో శర్మ, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్లు కోయి అంకారావు, వై.రత్నారెడ్డి, సర్పంచ్ బొనిగల ఎలీశమ్మ, మాజీ సర్పంచ్ జజ్జర ఆనందరావు, అన్నెం అంజిరెడ్డి, ముత్తవరపు రమణయ్య, జంపు హరిబాబు, వడ్లమూడి శ్రీనివాసరావు, కర్నాటి వెంకట్రావు, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న నరసింహారెడ్డి



చినగంజాంలో మృతుల కుటుంబాలకు నగదు అందజేస్తున్న నాయకులు

జే.పంగులూరు: వివిధ కారణాలతో మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ సీపీ నాయకులు అండగా నిలిచారు. మండల పరిధిలోని కల్లం వారిపాలెం గ్రామానికి చెందిన బొప్పాడి ప్రభాకర్ (60) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు నరసింహారెడ్డి, శుక్రవారం ప్రభాకర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేసి, ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు పార్టీ తరుఫున మేము ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు బిజ్జం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ న్యయంపు హనుమంతురావు, సర్పంచ్ గుడిపాటి శ్రీనివాసరెడ్డి, ఆదిరెడ్డి తదితరులు ఉన్నారు.

చినగంజాంలో

చినగంజాం: మండల కేంద్రం చినగంజాంలో ఇటీవల మరణించిన ఇరువురు వ్యక్తుల కుటుంబాలకు పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ మట్టి ఖర్చుల నిమిత్తం నగదు అందజేశారు. అంబేడ్కర్ సెంటర్‌లో నివాసముంటున్న మేడికొండ ప్రభాకరరావు ఇటీవల మృతి చెందారు. అతని మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు నగదును ఆయన భార్య ప్రసన్నకు అందజేశారు. అదే విధంగా అంబేడ్కర్ నగర్‌కు చెందిన మాజీ వార్డు సభ్యులు మేడికొండ సంగీతరావు మృతి చెందడంతో ఆయన మట్టి ఖర్చులు నిమిత్తం రూ.5 వేలు నగదు ఆయన కుమారులు మేడికొండ బాబురావు, రాజులకు అంజజేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ కన్వీనర్ పాదర్తి ప్రకాష్, పత్తిపాటి రామయ్య, మద్దిరాల పౌలు, బొలిమక్షర చంద్ర, మేడికొండ ప్రసాదరావు, వాటువల్లి స్వాములు, మాచవరపు చిన్న, ముసలారెడ్డి, స్టాలిన్, దావియేలు, పీ తిరుమలరావు, పలువురు మహిళలు, అంబేడ్కర్ నగర్ వాసులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

- బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి



మాట్లాడుతున్న బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి

మార్టూరు: బాల్యాన్ని మొగ్గదశలోనే అర్ధాంతరంగా ఆగిపోనివ్వకుండా బాలికలను సంరక్షించుకోవడం ద్వారా మెరుగైన సమాజాన్ని నిర్మించుకుందామని బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం నిర్వహించిన 'బేటీ బచావో, బేటీ పడావో' కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బాలికల హక్కులు పరిరక్షణలో తల్లిదండ్రులతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, వీఆర్వోలు, ఎంఆర్‌ఓలు, ఏఎన్ఎంలు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. బాల్యవివాహాలు నిర్మూలించడం, 18, 21 సంవత్సరాలు నిండిన యువతీ, యువకుల చట్టబద్ధమైన వివాహాలను ప్రోత్సహించడం మనందరి సామాజిక బాధ్యతని ఆమె అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 466 శిశు సంక్షేమ కేంద్రాలు నిర్వహిస్తున్నామని, బాలల సంరక్షణలో అలసత్వం ప్రదర్శించిన వారిపై చట్టపరమైన చర్యలుంటాయని ఆమె హెచ్చరించారు. సమాజంలో మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో సమష్టి కృషి అవసరం అని అన్నారు. సమాజంలోని ప్రతి మహిళ చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. అంతేకాక బాలికలకు సైతం అవగాహన కల్పించడం ద్వారా మెరుగైన సమాజ నిర్మాణానికి పునరంకితమవుదామని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె బాలికలు, మహిళలకు అవసరమైన సెక్షన్ 31,39 తదితర చట్టాల గురించి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, మహిళా సంరక్షణా కార్యదర్శులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ ఎస్‌వీ రాజశేఖర్ రెడ్డి, ఐసీడీఎస్ పర్చూరు, సంతమాగులూరు సీడీపీఓలు సుధ, సుభద్ర, ఎస్టీవో హరిహరరెడ్డి, సూపర్‌వైజర్ పద్మ, ఎంఈఓ ఎంపీహెచ్ వస్రం నాయక్, మార్టూరు, బల్లికురవ, సంతమాగులూరు, యద్దనపూడి, పర్చూరు మండలాల ఐసీడీఎస్ సిబ్బంది, ఏపీఎంలు, ఏఎన్ఎంలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేగంగా రహదారికి మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న నాగులపాడు రహదారి

అద్దంకి: పార్టీ అధినేత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అద్దంకి సమన్వయకర్తగా దమ్మున్న నాయకుడు పానెం చిన హనిమిరెడ్డిని పంపినట్లు ప్రజలు భావిస్తున్నారు. నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన దగ్గర నుంచి బిజీబిజీగా పార్టీ కార్యాక్రమాల్లో ఉంటూ మరో వైపు ప్రజా సమస్యల పట్ల దృష్టి సారించాడు. ఎవరు ఎక్కడ ఏ సమస్య తమకు ఉందని చెప్పినా వెంటనే స్పందించి ఆ పనిని వెంటనే చేయించే వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారు. దీంతో మాటతప్పని మడమతిప్పని నాయకునిగా సీఎం జగన్‌కు పేరుంటే, అద్దంకిలో మాటిచ్చాడంతే–చేస్తాడంతే అని హనిమిరెడ్డికి అనతికాలంలోనే పేరువచ్చింది. తాజాగా నాగులపాడు గ్రామానికి చెందిన ఎస్సీ ఎస్టీ,బీసీ మైనారిటీ ఐక్య వేదిక నాయకులు జ్యోతి రమేశ్ పదిరోజుల క్రితం వైఎస్సార్ సీపీ నాయకుడు నరసింహారెడ్డికి సమస్యల గురించి వివరించారు. అద్దంకి నుంచి నాగులపాడు వెళ్లే రహదారి బీటీ రహదారి దెబ్బతినడంతో నాలుగు రోజుల నుంచి మరమ్మతుల చేస్తున్నారు. దాంతో సాధారణ వ్యక్తులు సైతం ప్రజలకు సంబంధించిన పనులు కోరితే వెంటనే హనిమిరెడ్డి వెంటనే చేయిస్తున్నాడనే పేరు వచ్చింది. ఉదయం, సాయంత్రం వెళ్లే వాకర్స్‌తో పాటు ఐదారు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాను చెప్పగానే పనులు చేయించినందుకు రమేశ్ హనిమిరెడ్డికి అభినందనలు తెలిపారు.

ఇంటర్మీడియట్ పరీక్షకు 21 మంది గైర్హాజరు

పర్చూరు (చినగంజాం): పర్చూరు బీఏఆర్ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో శుక్రవారం మొదటి రోజు నిర్వహించిన ఇంగ్లీషు పరీక్షకు 21 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు కేంద్రం చీఫ్ చింపారెడ్డి తెలిపారు. మొత్తం పరీక్ష రాయాల్సిన విద్యార్థులు 123 మంది అని తెలిపారు. జిల్లా పరీక్షల కమిటీ కేంద్రాన్ని సందర్శించినట్లు ఆయన అన్నారు.

వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీ చించివేత



దుండగులు చించివేసిన వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీ

పర్చూరు (చినగంజాం): మండలంలోని వీరన్నపాలెం గ్రామంలో టీడీపీ అనుయాయులు వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలను శుక్రవారం చించివేశారు. గ్రామంలో రెండు వేర్వేరు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను వారు ధ్వంసం చేసి వారి వికృత చేష్టను ప్రదర్శించారు. ఎన్నికలలో పోటీ చేసేందుకు ధైర్యం సరిపోక ఇటువంటి చర్యలకు టీడీపీ శ్రేణులు పాల్పడుతున్నారని స్థానికంగా ప్రజలు చర్చించుకుంటున్నారు. గతంలో పర్చూరు నియోజకవర్గంలో రెండు పర్యాయాలు దొంగ ఓట్లను చేర్పించి ఎమ్మెల్యే సాంబశివరావు గెలుపు సాధించారనే విషయాన్ని నియోజకవర్గంలో సుమారు 10 వేల ఓట్లు తొలగించడం ద్వారా గుట్టురట్టయిందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఇటువంటి చర్యలు ద్వారా తేట ఆ విషయం తెల్లమవుతుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కబడ్డీ జట్టుకు క్రీడా దుస్తుల అందజేత



క్రీడాదుస్తులు అందజేసిన కబడ్డీ అసోసియేషన్ సభ్యులు

చినగంజాం: వైజాగ్‌లో ఈనెల 3 నుంచి 5 వతేదీ వరకు నిర్వహించే సీనియర్ పురుషుల కబడ్డీ పోటీలలో పాల్గొనే ప్రకాశం జిల్లా జట్టుకు శుక్రవారం క్రీడాదుస్తులను అందజేశారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి చెరుకూరి పుల్లయ్య సమకూర్చగా వాటిని స్థానిక లలితా రామకోటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. కడవకుదురు ఎంపీటీసీ సభ్యుడు ఆమంచి వెంకట సుబ్బారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పల్లపోలు లక్ష్మీనారాయణ, మాజీ ఉప సర్పంచ్ అనుమాలశెట్టి శ్రీరామకృష్ణ, పీఈటీ ముంగర సురేష్, సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు కుర్రి శ్రీనివాసరావు, ఎస్ నాగమల్లేశ్వరరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ కబడ్డీ పురుషుల జట్టును ప్రకటించారు. సీ అనిల్, ఎం తిరుపతిరెడ్డి, టీ సాయిబాబు, జీ లక్ష్మారెడ్డి, పీ బ్రహ్మారెడ్డి, జీ తేజారెడ్డి, ఎస్ నరేంద్రారెడ్డి, పీ బాలకృష్ణారెడ్డి, ఎం వెంకటేష్, వై రాజశేఖర్ రెడ్డి, బీ యశ్వంత్, ఎస్ వెంకటేష్ ఉన్నారు.

ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ, ఎస్సై

బల్లికురవ: త్వరలో జరిగే ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు రాజకీయ పార్టీలు, ఓటర్లు పోలీసు శాఖకు సహరించాలని సంతమాగులూరు సీఐ నరసింహారావు కోరారు. గ్రామదర్శినిలో భాగంగా గురు, శుక్రవారాల్లో గొర్రెపాడు, కూకట్లపల్లి, కొప్పరపాడు, ఎస్ఎల్ గుడిపాడు, వేమవరం కొమ్మినేనివారిపాలెం గ్రామంలో ప్రజలతో మాట్లాడారు. ఓటర్లు ఓటు హక్కును స్వేచ్ఛగా నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల్లో అల్లర్లు, అలజడులు, సృష్టిస్తే ఎంతటివారిపైనైనా రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. గ్రామాల్లోని ప్రజలు ఒకరికొకరు ఐక్యతతో కలసిమెలసి జీవించాలన్నారు. చిన్నచిన్న సమస్యలను పెద్దవి చేసుకుని పోలీస్ స్టేషన్, కేసులు, కోర్టులకు ఎక్కటం వల్ల ఎంతో విలువైన సమయం డబ్బు వృథా అవుతుందని సీఐ వివరించారు. కార్యక్రమాల్లో బల్లికురవ ఎస్సై బీ. నాగశివారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అంజనేయస్వామి అలయంలో బాలాజీ పూజలు



పూజలు చేస్తున్న సమన్వయకర్త బాలాజీ

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని పావులూరు పొలిమేర అంజనేయస్వామి దేవాలయంలో పర్చూరు వైఎస్సార్ సీపీ నియోజక వర్గ సమన్వయకర్త యడం బాలాజీ శుక్రవారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం దేవాలయానికి విచ్చేసిన అయనకు అలయ పూజారులు సంప్రదాయ రీతిలో ఆహ్వానం పలికారు. పూజా కార్యక్రమాలు అనంతరం అయనను పూజారులు శాలువా కప్పి అలయ పద్ధతిలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో నరసింహారెడ్డి, నాయకులు

అద్దంకి: రోజూ ఏదో ఒక చోట ఏదో ఒక గ్రామంలో టీడీపీని నాయకులు, కార్యకర్తలు వీడి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. తాజాగా శుక్రవారం మండలంలోని పార్వతీపురం గ్రామం నుంచి ఎంపీటీసీ సిద్దయ్య ఆధ్వర్యంలో పార్వతీపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి వైఎస్సార్ సీపీ పార్టీ నాయకుడు నరసింహారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించాడు. ఈ చేరిక కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బీవీకే రెడ్డి, కన్నడ సినిమా హీరో రాజవీరా ఉన్నారు.

456 మందికి వైద్య పరీక్షలు



మందులు అందజేస్తున్న ఎంపీటీసీ తిరుపతిరావు

చినగంజాం: ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధి పెదగంజాం–2 సచివాలయం పాత గొల్లపాలెం గ్రామంలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ ఎస్ విజయ భాస్కర్, డాక్టర్ పీ సాయి శ్రీ చరణ్, ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ వై భవానీలు వైద్యశిబిరంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. మొత్తం 456 మందికి వైద్యపరీక్షలు నిర్వహించడంతో పాటు వారికి అవసరమైన ఈసీజీ, రక్తపరీక్షలు నిర్వహించి వారికి నెలసరి సరిపడా మందులను అందజేశారు. గతంలో కంటి పరీక్షలు చేయించుకున్న 84 మందికి శిబిరం నందు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు ఎస్ సుధాకర్, ఎంపీటీసీ యల్లావుల తిరుపతిరావు, ల్యాబ్ టెక్నీషియన్ శ్యాంసుందరబాబు, సీహెచ్ఓ ఝాన్సీరాణి, పీహెచ్ఎన్ ఎస్ బేబి, సూపర్ వైజర్‌లు చిరంజీవి, ఉల్దారాణి, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు చిరంజీవి, మహేష్, ఆశలు పాల్గొన్నారు.





ఎమ్మెల్యే, సమన్వయకర్తను కలిసిన డీఎస్పీ

చీరాల: చీరాల డీఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బేతపూడి ప్రసాద్ శుక్రవారం ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. అలానే వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్‌ను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు.

ప్రైవేట్ పాఠశాలలో పేద విద్యార్థులు అవకాశం

పర్చూరు(చినగంజాం): పేద విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో వచ్చే విద్యాసంవత్సరంలో ఒకటో తరగతిలో ప్రవేశం కోసం ప్రభుత్వం ప్రకటన విడుదల చేసిందని పర్చూరు ఎంఈఓలు పీ వెంకటరామయ్య, ఎం సత్యనారాయణలు తెలిపారు. దీని ప్రకారం 24 ఫిబ్రవరి 2024 నుంచి 14 మార్చి 2024 వరకు అర్హులైన పిల్లల తల్లిదండ్రులు వెబ్‌సైట్‌లో సంబంధిత పత్రాలను జతపరచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనాథ పిల్లలకు , హెచ్ఐవీ బాధితులకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీన వర్గాల విద్యార్థులకు 6 శాతం రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి గ్రామ సచివాలయం, మండల విద్యాశాఖాధికారి కార్యాలయం సంప్రదించాలని తెలిపారు. సందేహాలను నివృత్తి చేసుకునేందుకు టోల్ ఫ్రీ నంబర్ 14417ను సంప్రదించాలని తెలిపారు.